

ప్రత్యేక అలంకరణలో కనుమ మారెమ్మ

మగ్గానికి ఊపిరి

నేతన్నల్లో చిగురిస్తున్న ఆశలు
పూర్వ వైభవం వస్తుందన్న నమ్మకం

క్లస్టర్ ఏర్పాటు, పథకాల అమలుకు ప్రభుత్వం చర్యలు

అంపశయ్యపై ఉన్న మగ్గానికి రాష్ట్ర ప్రభుత్వం ఊపిరి పోస్తోంది. ఉచిత విద్యుత్, పింఛన్లు, ఆరోగ్యబీమా, చేనేత క్లస్టర్ ఏర్పాటుపై బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత స్వయంగా ప్రకటించారు. దీంతో కుదేలైన చేనేత పరిశ్రమలో కొత్త ఆశలు చిగురించాయి. ప్రభుత్వ హామీల పట్ల నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పూర్వ వైభవం వస్తుందని ఆశా భావంతో ఉన్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలో వెయ్యి చేనేత, 6వేల మరమగ్గాలున్నాయి. రంగుల అద్దకం, జరీ, దోలు చుట్టే తదితర పనుల ద్వారా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం పట్టు ముడిసరుకు ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో గిట్టుబాటు కావట్లేదని నేతన్నలు వాపోతున్నారు. గతంలో కేజీ పట్టు రూ.3500 నుంచి రూ.4వేలు ఉన్న ధరలు.. ప్రస్తుతం రూ.6వేలు పలుకుతున్నాయి. వ్యాపారులు మాత్రం పాత ధరలకే చీరలు కొనుగోలు చేస్తున్నారని నేతన్నలు ఆవేదన చెందుతున్నారు.



సోమందేపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సొంత మగ్గాలు లేక మాస్టర్ వీవర్ల వద్ద కూలీలుగా పనిచేస్తున్న నేతన్నలు కూలి గిట్టుబాటు కాక ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్తున్నారు. సోమందేపల్లిలో దాదాపు 7వేల మంది చేనేత కార్మికులున్నారు. వీరిలో చాలామంది భవన నిర్మాణ, వ్యవసాయ కూలి, ఫ్యాక్టరీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. మరికొంతమంది బెంగళూరు లాంటి ప్రాంతాలకు వెళ్తున్నారు. దూరం వెళ్లలేనివారు కియ అనుబంధ సంస్థల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. పవర్‌లూమ్స్ అధికం కావడంతో చీరకు రూ.250 నుంచి రూ.300 దాకా కూలీ ఇస్తున్నారు. చేతిమగ్గాల్లో వారానికి చీరనేస్తే రూ.వెయ్యి మాత్రమే లభిస్తుంది. ఆ సంపాదన కుటుంబపోషణే చాలట్లేదని నేతన్నలు వాపోతున్నారు. పిల్లల చదువులు, ఆస్పత్రి ఖర్చులకు అప్పులు చేయాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఏళ్లుగా నమ్ముకున్న చేనేత వృత్తిని వీడి ఇతర పనులకు వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. కూలి రేట్లు పెంచమని అడిగితే యజమానులు గిట్టుబాటు ధర లభించడం లేదని చెబుతున్నారని వారు వాపోతున్నారు. దీంతో చేసేదిలేక వలసబాట పడుతున్నట్లు చెబుతున్నారు.



తయారైన పట్టుచీరలు

క్లస్టర్ ప్రకటనపై హర్షం

ఇటీవల బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి సోమందేపల్లికి వచ్చిన సందర్భంగా చేనేత క్లస్టర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. చేతి మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత కరెంట్ ఇస్తామన్నారు. 50ఏళ్లు నిండిన చేనేతలకు పింఛన్లు అందిస్తామన్నారు. ఆరోగ్య బీమా ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో నేతన్నల్లో ఆశలు చిగురించాయి. క్లస్టర్ ఏర్పాటైతే 200 నుంచి 300 మంది కార్మికులకు పని దొరుకుతుందని భావిస్తున్నారు. నూతన డిజైన్లతో చీరలను ఎలా నేయాలో క్లస్టర్‌లో శిక్షణ ఇస్తారు. వర్క్‌షెడ్లను ఏర్పాటుచేసి ఉత్పాదన పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుంది. అందులో అర్హులైన తమకు చోటుదక్కుతుందని ఆశిస్తున్నారు. 90శాతం సబ్సిడీతో చేనేత మగ్గాల యంత్ర పరికరాలను పంపిణీ చేస్తుంది. ఇది నేతన్నలకు ఎంతగానో ఉపకరిస్తుంది. కొన్ని నెలల క్రితం మంత్రి సవిత నాలుగురకాలైన మగ్గాలకు సంబంధించి సబ్సిడీ యంత్ర పరికరాలను చేనేతలకు అందించారు. 35 మందికి వర్క్‌షెడ్లు మంజూరు చేయించారు. మరిన్ని ప్రయోజనాలు కల్పించాలని నేతన్నలు కోరుతున్నారు. స్థలాలుండి ఇల్లు కట్టుకోలేనివారికి ప్రభుత్వమే కట్టించి, ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సొంత మగ్గాలు ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక చేయూత అందించాలని కోరుతున్నారు. అప్పుల ఊబిలో చిక్కుకుని, ఆత్మహత్య చేసుకున్న చేనేతల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



పూర్వ వైభవం వస్తుంది

ప్రభుత్వ రాయితీ పథకాలతో చేనేతకు పూర్వ వైభవం వస్తుందని భావిస్తున్నాం. పట్టుచీరలకు గిట్టుబాటు ధర కల్పించి, ఆదుకోవాలి. క్లస్టర్ ఏర్పాటుతో వందల మందికి ఉపాధి దొరుకుతుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ హర్షణీయం.

-సీసీ హరిదాస్, మాస్టర్ వీవర్, సోమందేపల్లి

ముడిసరుకు ప్రభుత్వమే అందించాలి..

ప్రస్తుతం చేనేత మగ్గాలపై నేస్తున్న చీరలకు సంబంధించి కేజీ పట్టు ధర రూ.6వేలు పలుకుతోందనీ, ఖర్చులుపోను రూ.500 గిట్టుబాటు అవుతోందని నేతన్నలు చెబుతున్నారు. ధరలు పతనం కావడంతో తాము దిక్కుతోచని స్థితిలో ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే ముడిసరుకును తక్కువ ధరకు అందించి, నేసిన చీరలను కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు అవసరమైన ప్రభుత్వ మార్కెట్లను నెలకొల్పాలని కోరుతున్నారు. పాలిస్టర్ చీరలు రూ.4 వేలకే మార్కెట్‌లో లభిస్తాయనీ, పట్టుచీరలు రూ.7వేల నుంచి రూ.10వేలు ధర పలుకుతున్నాయన్నారు. ప్రజలకు అవగాహన లేక పాలిస్టర్ చీరల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. రెండింటి మధ్య వ్యత్యాసంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నేతన్నలు అభిప్రాయపడుతున్నారు. తద్వారా పట్టుచీరల విక్రయాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలంటున్నారు. పరిశ్రమలోకి వచ్చేందుకు ఇప్పటికే ఎవరూ ఆసక్తి చూపట్లేదనీ, ఇప్పటికీ ఆదుకోకపోతే రాబోవు రోజుల్లో మగ్గం కనుమరుగయ్యే పరిస్థితి దాపురిస్తుందని వారు వాపోతున్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

చేనేత కార్మికులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలి. పెన్షన్లను పునరుద్ధరించాలి. అవసరమైన ప్రతి చేనేతకు వర్క్‌షెడ్ మంజూరు చేయాలి. ఉచిత విద్యుత్ పథకంలో అనేక ఇబ్బందులున్నాయి. ప్రస్తుతం వంద యూనిట్లు మాత్రమే అందుతోంది. ఈ పథకాన్ని చేనేత అనుబంధ కార్మికులకు సైతం వర్తింపజేయాలి. ప్రభుత్వమే ముడిసరుకును అందించి, చీరలను కొనుగోలు చేయాలి.



- చీల నారాయణస్వామి, చేనేత కార్మిక సంఘం నేత, సోమందేపల్లి

అమ్మా... మారెమ్మా..!

వైభవంగా కనుమ మారెమ్మ జ్యోతుల ఉత్సవం

మడకశిర టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పదేళ్ల తర్వాత కనుమ మారెమ్మ ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆమిదాలగొంది సమీపంలో ఉన్న కనుమ మారెమ్మను సోమవారం రాత్రి పట్టణవాసులు మడకశిర పట్టణానికి తరలించి కొల్లపురమ్మ ఆలయ ఆవరణలో ఉంచారు. మంగళవారం తెల్లవారు జామునుంచే మారెమ్మకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచే నగర పంచాయతీ పరిధిలోని గ్రామాల నుంచి మహిళలు రంగు రంగుల జ్యోతులను ఎత్తుకుని పావగడ రోడ్డులోని కొల్లపురమ్మ ఆలయం వద్ద వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం అక్కడ ఉంచిన మారెమ్మ అమ్మవారికి జ్యోతులను అర్పించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మంగళవారం పట్టణంలో నిర్వహించిన కనుమ మారెమ్మ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతరను డ్రోన్ కెమెరా ద్వారా ఎస్పీ రత్న పరిశీలించారు.



కనుమ మారెమ్మకు ప్రత్యేక పూజలు జరిపిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తదితరులు

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రామసుబ్బయ్య

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రామసుబ్బయ్యను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆయనను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా జిల్లాకు కేటాయించారు.

జిల్లాకు సౌర విద్యుత్ ప్రాజెక్టు

మడకశిరలో ఏర్పాటుకు మంత్రి మండలి గ్రీన్‌సిగ్నల్

పుట్టపర్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మడకశిరలో సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన ఈ కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపారు. మడకశిర మండలంలోని హరేసముంద్రం, బుల్లసముద్రం, ఉప్పర్లపల్లి, ఎర్రబొమ్మనహల్లి, కల్లుమర్రి, మనూరు పరిధిలో 2వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును స్థాపించడానికి ఎంఎస్ చింత గ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించింది. ఈనేపథ్యంలో జిల్లాలో మరో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇప్పటికే ప్రభుత్వం మడకశిరలో మొదటిదశలో రూ.1430 కోట్ల పెట్టుబడితో భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టం లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్) రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగులు, మందుగుండు సామగ్రి పరిశ్రమకు ప్రభుత్వం భూములు కేటాయించింది. తాజాగా సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పారిశ్రామికరంగానికి మరింత ఊతమిచ్చినట్లయింది. జనవరిలో సోమందేపల్లి మండలం గుడిపల్లి పారిశ్రామిక వాడలో ప్రపంచ అత్యున్నత స్థాయి బస్సుల బాడీ బిల్డింగ్ తయారీలో పేరున్న ఎంఎస్ ఆజాద్ ఇండియన్ మొబిలిటీ ప్రైవేటు లిమిటెడ్ యూనిట్‌కు ప్రభుత్వం 70.7 ఎకరాలు కేటాయించింది. పది నెలల్లో జిల్లాలకు ఆటోమొబైల్ పరిశ్రమలతోపాటు రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగులు, మందుగుండు సామగ్రి తయారీ, సౌర విద్యుత్ పరిశ్రమలకు భూములు కేటాయించి, ఆమోదం తెలపడం జిల్లాలో అభివృద్ధికి బాటలు పడుతున్నాయి.



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

● సోషల్ మీడియాలో రెచ్చగొడితే జైలుకే.. ● వాల్మీకి లోకేష్‌ను రౌడీషీటర్‌గానే పరిగణిస్తాం : డీఎస్పీ మహేష్

హిందూపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో రెచ్చగొట్టే చర్యలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తేలేదని డీఎస్పీ మహేష్ స్పష్టం చేశారు. స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో నివాసముంటున్న న్యామద్దలకు చెందిన మోహన్ నాలుగు రోజుల క్రితం మద్యం మత్తులో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడన్నారు. అతడిపై కేసు నమోదుచేసి, అరెస్టు చేశామన్నారు. అతడి ఇంటి వద్ద కెళ్లి ఇనుపరాడ్ పట్టుకుని హల్‌చల్ చేసిన వైసీపీ యువ నాయకుడు వాల్మీకి లోకేష్, నవీన్‌పై కూడా కేసు నమోదుచేసి, కోర్టులో హాజరుపరిచామన్నారు. మోహన్‌పై దాడిచేసిన సూరితో పాటు మరో నలుగురిని అరెస్టు చేశామన్నారు. వాల్మీకి లోకేష్‌పై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో నాలుగు క్రిమినల్ కేసులు, టూటౌన్‌లో రౌడీషీట్ ఉందన్నారు. దీంతో అతడిని రౌడీషీటర్‌గానే పరిగణిస్తామన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలుకు పంపుతామని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, అంజనేయులు, కరీం, జనార్దన్, ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ



ముందుగా.. కొత్తగా..

సిద్ధమవుతున్న పాఠ్య పుస్తకాలు
కిట్లనూ సిద్ధం చేస్తున్న విద్యాశాఖ
పిల్లలకు తగ్గనున్న పుస్తకాల బరువు

ధర్మవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. పాఠశాలలు తెరిచే సమయానికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు జిల్లాలో దాదాపు 1.4లక్షల మంది ఉన్నారు. ఈ సంఖ్యపెరిగే అవకాశాలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా జిల్లాకు ఏయే తరగతులకు ఎన్నెన్ని పుస్తకాలు అవసరమో జిల్లా విద్యాశాఖ ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించింది. పాఠ్యపుస్తకాలతో పాటు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు కూడా అందజేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు తెరిచిన రెండు మూడు నెలల వరకూ విద్యార్థులకు పుస్తకాలు సరఫరా చేయలేని పరిస్థితి ఉండేది. దీంతో చాలా మంది విద్యార్థులు తమకు అవసరమైన పుస్తకాలను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసేవారు. గత ప్రభుత్వంలో కమీషన్లకు కక్కుర్తి పడి పాఠ్యపుస్తకాల ముద్రణను ముంబై, ఉత్తరప్రదేశ్‌లోని ప్రింటర్లకు అప్పగించేవారు. అక్కడ ముద్రించిన పుస్తకాలు సకాలంలో జిల్లాలకు చేరేవి కాదు. ఆ ప్రభావం విద్యార్థులపై పడేది. ఈ ఇబ్బందులను గమనించిన ప్రస్తుత ముఖ్య మంత్రి చంద్రబాబు ఈ ఏడాది నుంచి పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సకాలంలో అందించేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇతర రాష్ట్రాలలో పాఠ్యపుస్తకాల ముద్రణకు స్వస్తి పలికారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ, తెనాలి తదితర ప్రాంతాలలోని ప్రింటింగ్ ప్రెస్‌లకు అప్పగించారు. ఫలితంగా సకాలంలో విద్యార్థులకు పుస్తకాలు అందించేందుకు వెసులుబాటు కలగనుంది.

తగ్గిన పుస్తకాల బరువు

పిల్లలకు పుస్తకాలు భారం కాకుండా పాఠశాల విద్యాశాఖ యంత్రాంగం వివిధ సబ్జెక్టులను కలిపి ఒకే పుస్తకంగా తీసుకురానుంది. ఫలితంగా పుస్తకాల సంఖ్య తగ్గుతోంది. గతంలో మూడు సెమ్‌లుగా ముద్రించేవారు. ప్రస్తుతం రెండు సెమ్‌లకే పరిమితం చేస్తున్నారు.

● 1-5 తరగతులకు తెలుగు, ఇంగ్లిషు, గణితం కలిపి ఒకేపుస్తకంగా ముద్రించారు. వర్క్‌బుక్‌ను అదనంగా చేర్చారు.

● 6-9 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు, హిందీ కలిపి ఒకే బుక్‌గా ముద్రించారు. ఎన్ఎస్, పీఎస్ కలిపి ఒకటే చేశారు. గతంలో సాంఘిక శాస్త్రం మూడు పుస్తకాలు ఉండేది. ప్రస్తుతం ఒకటిగా అందించనున్నారు. పదో తరగతిలో హిందీ మారుతోంది.

కిట్లలో ఏం ఉంటాయంటే..?

ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పేరుతో ఉచితంగా కిట్లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఒక్కో కిట్‌లో ఒక బ్యాగ్, బెల్ట్, జత బూట్లు, రెండుజతల సాక్సులు, మూడు జతల యూనిఫాంలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, వర్క్‌బుక్ ఉంటాయి. గతంలో మాదిరిగా బూట్లు, దుస్తుల విషయంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సారి యూనిఫాంల రంగు కూడా మార్చారు.

ముందుగానే పాఠ్యపుస్తకాలు



2025-26 విద్యాసంవత్సరానికి ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను ముందుగానే అందించనుంది. జిల్లాలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు దాదాపు 1.4లక్షల దాకా ఉన్నారు. వీరికి ప్రభుత్వం పుస్తకాల బరువును కూడా తగ్గించనుంది. గతంలో ఒక్కో సబ్జెక్టుకు మూడు సెట్లకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం మూడు సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంగా అందించేందుకు చర్యలు తీసుకుంది.

-కిష్టప్ప, డీఈఓ



విహార యాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ, టీచర్లు

నేడు విద్యార్థుల విహార యాత్ర

కొత్తచెరువు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం విద్య, వైజ్ఞానిక యాత్ర నిర్వహిస్తోందని డీఈఓ కిష్టప్ప తెలిపారు. ఇందులో భాగంగా శ్రీసత్యసాయిజిల్లా నుంచి 120 మంది విద్యార్థులు, 20 మంది ఎస్కార్టు టీచర్లు ఎంపికయ్యారని డీఈఓ తెలిపారు. ఈ విద్యార్థులు మడకశిర, ధర్మవరం, కదిరి ప్రాంతాల నుంచి మూడు బస్సుల్లో ఈనెల 16 బయల్దేరుతారన్నారు. నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం, అగస్త్యఫౌండేషన్ కుప్పంలను సందర్శిస్తారన్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను డీఈఓతోపాటు జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్ తనూజ్‌కుమార్, ఉపాధ్యాయులు ఇర్షాద్‌వలీ, సురేశ్, ఏపీటీఎఫ్ చంద్ర ఆవిష్కరించారు.

'సాయి ప్రేమామృత సారం' ప్రారంభం

పుట్టపర్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సాయి సహస్ర నామాహారం, సాయి ప్రేమామృతసారం పేరిట పుట్టపర్తిలో మంగళవారం సాయంత్రం భక్తి గీతాల ఆలాపన ప్రారంభించారు. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత సభామంటపంలో సత్యసాయి అష్టోత్తర శతనామావళి, నామాంజలి పేరిట భక్తిపాటలను ప్రారంభించారు. ఈనెల 22 వరకు రోజూ భక్తిపాటల ఆలాపన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 1008 పాటలను సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధి జయకుమార్ రూపొందించారు. 8 రోజులపాటు భక్తి పాటలు ఆలపిస్తారని వెల్లడించారు. సర్వదేవతలకు సంబంధించిన భక్తి పాటలను ఆలపిస్తారని పేర్కొన్నారు. మొదటిరోజు భక్తిపాటల ఆలాపనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



భజన చేస్తున్న భక్తులు


పుట్లూరులో దెబ్బతిన్న అరటి పంట


గార్లదిన్నె మండలం ఇల్లూరులో దెబ్బతిన్న వరి పంట

గాలివాన విధ్వంసం

● రూ.2.28 కోట్ల పంటనష్టం ● 266.6 హెక్టార్లల్లో దెబ్బతిన్న పంటలు


జంబులదిన్నెలో పడిపోయిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు


అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

అనంతపురం అర్బన్/నెట్‌వర్క్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ఈదురు గాలులు రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఉద్యాన, వ్యవసాయ శాఖ పరిధిలో రూ.కోట్ల విలువైన పంట నష్టం జరుగుతోంది. దీంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విన్నవిస్తున్నారు. జిల్లాలో సోమవారం రాత్రి ఈదురు గాలులు, వర్ష బీభత్సానికి 266.6 హెక్టార్లల్లో రూ.2.88 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయి. శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, అనంతపురం, యల్లనూరు, ఉరవకొండ, కూడేరు, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, రాయదుర్గం, గుమ్మఘట్ట, గుంతకల్లు, పెద్దవడుగూరు మండలాల్లో 115 మంది రైతులకు సంబంధించి 94.60 హెక్టార్లల్లో రూ.1.48 కోట్ల విలువైన అరటి, మామిడి, బొప్పాయి, కర్బూజ, మునగ, కాకర పంటలు దెబ్బతిన్నాయి. నార్పల, గార్లదిన్నె, కంబదూరు, శింగనమల మండలాల్లో 93 మంది రైతులకు సంబంధించి 172 హెక్టార్లల్లో రూ.1.40 కోట్ల విలువైన మొక్కజొన్న, వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా కణేకల్లులో 10.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. పుట్లూరు 9.4, నార్పల 9.2, బెళుగుప్ప 7.8, గుత్తి 7.2, కంబదూరు 2.6, ఉరవకొండ 2.2, అనంతపురం 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● పుట్లూరు మండలంలో ఈదురు గాలులకు 80 ఎకరాల్లో అరటి పంట నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారి శైలజ తెలిపారు. కడవకల్లు, దోసలేడు, చెర్లోపల్లి, మడ్డిపల్లి గ్రామాల్లో 40 మంది రైతులు నష్టపోయారని, ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామని ఆమె తెలిపారు.

● నార్పల మండలం బండ్లపల్లి, గంగనపల్లి, బి.పప్పూరు గ్రామాల్లో దెబ్బతిన్న అరటి పంటను జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్, ఉద్యాన అధికారి శైలజ పరిశీలించారు. నార్పల, హెచ్ శోధనపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న మామిడి తోటలను ఉద్యాన విస్తరణాధికారి హరిచరణ్ రెడ్డి, రైతు సేవా సిబ్బంది దివ్య, శశిధర్, పరిశీలించారు. నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు.

● గార్లదిన్నె మండలం కొప్పలకొండ, ఇల్లూరు, జంబులదిన్నె, కేశవాపురం, కమలాపురం, సిరివరం తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పది మంది రైతులకు చెందిన 15 ఎకరాల వరి పంట, ఆరుగురు రైతులకు చెందిన 10 ఎకరాల మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. నష్ట పరిహారం అందచేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి సోమశేఖర్ రైతులకు భరోసా ఇచ్చారు. ఇల్లూరు, జంబులదిన్నె తదితర గ్రామాల్లో కూలిన మామిడి చెట్లను అధికారులు పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. బాధిత రైతులకు నష్ట పరిహారం వస్తుందని తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

కూడేరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో ఉద్యాన పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని కడదరకుంట, చోళసముద్రం గ్రామాల్లో దెబ్బతిన పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. కడదరకుంట గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ నాలుగెకరాల్లో సాగు చేసిన అరటి పంట ఈదురుగాలలు, వర్షానికి పూర్తిగా పడిపోయింది. రూ.8 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బతిందంటూ రైతు కన్నీరు మున్నీరయ్యాడు. దిగుబడి ఆశాజనకంగా రావడంతో అప్పుల నుంచి బయట పడుతాననుకున్న సమయంలో అకాల వర్షం, ఈదురుగాలులు దెబ్బతీశాయని వాపోయాడు. అనంతరం చోళసముద్రం గ్రామానికి చెందిన రైతు వెంకటనారాయణ అరటి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ.. అనంతపురం, కడప జిల్లాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణం ఎకరాకు రూ.50 వేలు పరిహారం అందించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, కేశవరెడ్డి, గోపాల్, రమణ, రాజేష్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ కుళ్లాయిస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెరుగు సంగప్ప, మల్లికార్జున, రమణ, మలరాయుడు పాల్గొన్నారు.

● కూతురు..!



అమ్మా..
త్వరగా తొయ్..
బడికి సమయమౌతోంది..!
బతుకు బాధ్యత నీదే
అయినా..
కాస్తంత బరువు
పంచుకోవడం..
నా బాధ్యత కూడానూ..!

(గుంతకల్లు పట్టణానికి చెందిన ఈ చిన్నారి పేరు ఐశ్వర్య. ఎస్‌జేపీ పాఠశాల విద్యార్థిని. తల్లి సుకన్య తోపుడు బండిపై పండ్లను అమ్ముతుంటారు. తండ్రి రవి కుమార్ దినకూలీ. శ్రమ జీవుల కుటుంబంలో పుట్టిన ఈ కూతురుకు చదువంటే ఆసక్తి. రోజూ ఉదయం ఇలా తల్లికి సాయంగా బండిని తోసుకుంటూ పండ్లు అమ్మే ప్రాంతానికి చేరుస్తుంది. ఆ తరువాత బడికి వెళ్లిపోతుంది. మంగళవారం ఉదయం కూడా ఇలా తల్లికి సాయం పడుతూ.. 'త్వరగా తొయ్ అమ్మా.. బడికి టైం అవుతోంది..' అంటూ ఆత్రపెడుతూ కనిపించింది)

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు టౌన్

24 నుంచి డిగ్రీ పరీక్షలు

జ్ఞానభూమి, ఎస్కేయూ వెబ్‌సైట్లలో హాల్ టిక్కెట్లు

ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో ఈనెల 24నుంచి డిగ్రీ రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు, మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ మంగళవారం తెలిపారు. ప్రథమ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24నుంచి మే 6వరకు. ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్ ఈ నెల 25నుంచి మే 31 వరకు ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 55 కేంద్రాల్లో 25వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నా రు. విద్యార్థులు హాల్ టిక్కెట్లను జ్ఞానభూమి పోర్టల్‌లో డౌన్ చేసుకోవచ్చని సూచించారు. మెగా సప్లిమెంటరీ విద్యార్థులు ఎస్కేయూ వెబ్‌సైట్‌లో డౌన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తృతీయ సంవత్సరం ఐదు, ఆరు సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 24నుంచి మే 16వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలుంటాయని వివరించారు.

జిల్లావాసులకు కందుకూరి పురస్కారాలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన 13 మందికి జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలు లభించాయి. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా పురస్కారాలు ప్రకటించారు. ముగ్గురిని రాష్ట్రస్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలకు, 107 మందిని జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలకు ఎంపిక చేశారు. రంగస్థల ప్రముఖులు బుర్రా సాయిమాధవ్, గుమ్మడి గోపాలకృష్ణ, పాటిబండ్ల ఆనందరావు, చిక్కాల బాలాజి, కేకేఎల్ స్వామి, బాలాజీనాయక్, దాసరి చలపతిరావు, గాజుల పద్మజ, బుద్దాల వెంకటరామారావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి పురస్కార గ్రహీతలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా తరపున 13 మందిని కందుకూరి విశిష్ట పురస్కారాలకు ఎంపిక చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న సభలో వీరికి పురస్కారాలతోపాటు నగదు బహుమతులు అందజేసి సత్కరించనున్నారు.

పురస్కార గ్రహీతలు వీరే...

వాల్మీకి కుళ్లాయప్ప, సోమర లక్ష్మీనారాయణ, సంగాల నారాయణస్వామి, పి.ఆనంద్, జేకే రామాంజనేయులు, వి.ఆదినారాయణరెడ్డి, జీజే ఎర్రిస్వామి, ఎ.రామగోపాల్, జి.నరహరి, ఎస్ నారాయణస్వామి, శివశంకర్, డి.రాజకుళ్లాయప్ప, బి.వరప్రసాద్.

సంగీత పోటీల్లో గిన్నిస్ రికార్డు



గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకుంటున్న జాస్మిన్ వేదశ్రీ

గుత్తి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దొడ్డి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీ టీచర్ ఎంబీ జాస్మిన్ వేదశ్రీ క్రిస్టియన్ సంగీత పోటీల్లో గిన్నిస్ రికార్డు సాధించారు. గతేడాది డిసెంబరు 1న ఆవెం తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన 1046 మంది కళాకారులు ఆన్‌లైన్‌లో క్రిస్టియన్ పాటలు పాడారు. తద్వారా గిన్నిస్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నారు. హైదరాబాద్‌లో ఈనెల 14వ తేదీన ఏర్పాటు చేసిన అభినందన సభలో బహుమతులతోపాటు సర్టిఫికెట్, మెడల్‌ను ప్రదానం చేసినట్లు టీచర్ తెలిపారు.

భళా.. మహిమాన్విత్..

రెండో తరగతి విద్యార్థికి గిన్నిస్ వరల్డ్ రికార్డు



గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకుంటున్న మహిమాన్విత్

చిలమత్తూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రెండో తరగతి విద్యార్థి మహిమాన్విత్ పియానో వాయిద్యానికి గిన్నిస్ రికార్డు దాసోహమైంది. పియానో వాయిద్యాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. ఆ వీడియోను చూసిన వారు ముగ్ధులయ్యారు. పోస్ట్ చేసిన గంటలోనే ఏకంగా 1,046 మంది వీక్షించి, అభినందించారు. దీంతో అతి తక్కువ సమయంలో ఎక్కువమంది వీక్షకులు చూసిన వీడియోగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకులు గుర్తించారు. దీంతో చిన్నారి మహిమాన్విత్‌కు అవార్డ్స్‌లో చోటు కల్పించారు. టేకులోడు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ముత్యాలప్ప కుమారుడు మహిమాన్విత్.

స్థానిక ఎస్ఎస్‌వైవీఎన్ ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. మహిమాన్విత్‌ను పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఏంటో ఈ పంచాయతీ?

పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్ల దిగులు



క్లరికల్ సిబ్బంది అసమర్థతతో అర్హులకు అన్యాయం

ముందుకు కదలని గ్రేడ్-3, గ్రేడ్-4ల ప్రక్రియ

గ్రేడ్-5కు మాత్రమే అప్పుడే శ్రీకారం

ఏ ప్రాతిపదికన ఉద్యోగోన్నతి ఇస్తారోననే ఉత్కంఠ


(డీపీఓ కార్యాలయం(ఫైల్)

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులను ప్రమోషన్ల దిగులు వేధిస్తోంది. జిల్లా పంచాయతీ కార్యాలయంలో క్లరికల్ సిబ్బంది అసమర్థతతో ప్రమోషన్లలో అర్హులకు అన్యాయం జరుగుతున్నట్లు సమాచారం. ఈక్రమంలో ఇప్పటి వరకు కొందరు గ్రేడ్-1 కార్యదర్శులకు మాత్రమే ఈఓఆర్డీలుగా ప్రమోషన్ కల్పించారు. గ్రేడ్-2 కార్యదర్శులలో కొందరికి గ్రేడ్-1 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పై రెండు కూడా కమిషనర్ కార్యాలయం పరిధిలో ఉండటంతో అక్కడికి నివేదిక పంపి, అక్కడ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు అవకాశం కల్పించారు. ఇక మిగిలిన గ్రేడ్లకు కలెక్టర్ ద్వారా అనుమతి పొంది తుది జాబితాను రూపొందించి కమిషనర్ కార్యాలయానికి పంపి ప్రమోషన్లు ఇవ్వాలి. అయితే అసలైన సమస్యలు ఇక్కడే మొదలయ్యాయి. సీనియార్టి జాబితా, రోస్టర్ తయారు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆఖరికి ఏదోలా ఫైల్ తయారు చేసి కమిషనర్ కార్యాలయానికి పంపారు. అక్కడ నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పుకొస్తున్నారు. గ్రేడ్-3, గ్రేడ్-4 ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి కాకనే గ్రేడ్-5 కార్యదర్శుల ప్రమోషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. అయితే మిగిలిన జిల్లాల్లో ఇప్పటికే ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఎక్కడా పెండింగ్ లేకుండా తగిన చర్యలు చేపట్టి గ్రేడ్-5 కూడా పూర్తి చేశారు. దీంతో మీరేందుకు చేయలేకపోతున్నారని కమిషనర్ కార్యాలయం నుంచి డీపీఓను ప్రశ్నించినట్లు సమాచారం.

గతంలో దూకుడు.. ప్రస్తుతం బ్రేక్

డీపీఓ నాగరాజనాయుడు గతంలో పనిచేసిన ప్రాంతాల్లో చాలా చురుగ్గా ఎప్పటి సమస్యలు అప్పుడు పరిష్కరించారన్న గుర్తింపు పొందారు. అదే తరహాలో ఇక్కడ కూడ చేస్తారని సిబ్బంది ఆశించి, భంగపడ్డారు. నాగరాజనాయుడు కర్నూలు డీపీఓగా పని చేసిన రోజుల్లో అప్పటి ప్రభుత్వ అండదండలు మెండుగా ఉండేవన్న ప్రచారం జరుగుతోంది. దీంతో తమ ఆలోచనలకు పదును పెట్టి పాలనాపరమైన అంశాల్లో చురుగ్గా వ్యవహరించారన్న గుర్తింపు ఉంది. అలా చురుగ్గా వ్యవహరించిన వాటిలో కొన్నింటికి ప్రస్తుతం సంజాయిషీ చెప్పుకోవాల్సి రావడం ఆయన స్పీడ్‌కు బ్రేక్‌లు పడినట్లైంది. వైసీపీ ప్రభుత్వంలో అండదండలందించిన ఓ మంత్రి ప్రస్తుతం అధికార పార్టీలో కూడా ప్రజాప్రతినిధిగా ఉన్నారు. దీంతో మనకేమి ఇబ్బంది ఉండదని డీపీఓ భావించారు. అయితే అప్పటి మంత్రి పాచికలు ప్రస్తుత ప్రభుత్వంలో పారకపోవడంతో ఆయన అనుయాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. కర్నూలు డీపీఓగా ఉన్న సమయంలో జరిగిన తప్పిదాలకు సంబంధించి నెలలో రెండు రోజులు సంజాయిషీ ఇచ్చుకోవడానికి వెళ్లాల్సి రావడం, ఇక్కడి ప్రజా ప్రతినిధుల సహకారం లేకపోవడంతో డీపీఓ నాగరాజనాయుడు ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు సమాచారం.

డీపీఓకు బదిలీ భయం



ఉద్యోగోన్నతుల ప్రక్రియలో స్థానిక ప్రజాప్రతినిధుల మాట చెల్లుబాటు కాకపోతే డీపీఓపై భారీగా వ్యతిరేకత పెరిగే అవకాశం ఉంది. ఒక వేళ వారి సిఫార్సులు మన్నిస్తే కోర్టు కేసులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఇప్పటికే డీపీఓను మార్చాలని పెద్ద ఎత్తున ఒత్తిళ్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బదిలీకి బలమైన కారణం లేకపోవడంతో ఆయన సేఫ్‌గా ఉన్నారు. బదిలీల ప్రక్రియలో చిన్న లోపం దొర్లినా దాన్ని సాకుగా చూపి సాగనంపే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. దీంతో డీపీఓ జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం.

గ్రేడ్లు.. ఉద్యోగులు.. ఖాళీలు ఇలా..

ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రేడ్-5 ప్రమోషన్లు చేపట్టేందుకు అధికారులు అడుగులు వేస్తున్నారు. అయితే గ్రేడ్-3, గ్రేడ్-4 కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించిన తరువాతే గ్రేడ్-5 కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించే అవకాశం ఉంది. అలా కాకుండా గ్రేడ్-5 కార్యదర్శుల ఉద్యోగోన్నతులకు శ్రీకారం చుడితే ఖాళీ అయ్యే స్థానాలను ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియని పరిస్థితి. గ్రేడ్ల వారిగా ఖాళీలను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 49 మంది గ్రేడ్-1 కార్యదర్శులు ఉండాల్సి ఉండగా 43 మంది ఉన్నారు. గ్రేడ్-2 కార్యదర్శుల్లో అర్హులకు ఉద్యోగోన్నతి కల్పిస్తే గ్రేడ్-2 ఖాళీలు మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే అధికారులు వీటిని పట్టించుకోవడం లేదు. గ్రేడ్-2 కార్యదర్శులు 18 మంది ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. ఇందుకు కొన్నేళ్లుగా గ్రేడ్-3 కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించకపోవడమే కారణమని తెలిసింది. గ్రేడ్-3 కార్యదర్శులు 115 మంది ఉండాల్సి ఉండగా అందరూ ఉన్నారు. దీంతో వీరు ఏళ్లుగా ఎటువంటి ప్రమోషన్లు లేకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా ఉన్నారు. గ్రేడ్-4 కార్యదర్శులకు ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరు 441 మంది ఉండాల్సి ఉండగా 333 మంది మాత్రమే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన గ్రేడ్-5 కార్యదర్శులకు ప్రమోషన్ కల్పించి ఈ ఖాళీలు భర్తీ చేయడానికి శ్రీకారం చుట్టనున్నారు.

ర్యాంకులా .. ప్రొబేషన్ ఖరారా?

గ్రేడ్-5 కార్యదర్శులకు సంబంధించి ప్రమోషన్ల ప్రక్రియకు శ్రీకారం చుడుతుండటంతో ఇందులో పలు అపోహలు కలుగుతున్నాయి. ఉద్యోగం పొందినప్పటి ప్రతిభకు ఆధారంగా వచ్చిన ర్యాంకును పరిగణలోకి తీసుకుంటారా..? లేదా రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకొని ప్రొబేషన్ ఖరారు చేసుకున్నవారికి ప్రాధాన్యం ఇస్తారా అన్న చర్చ జరుగుతోంది. ఇందులో అందరికి కాకపోయిన కొంత మంది దగ్గర సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్రతిభకు అనుగుణంగా ర్యాంకుల వారిగా ఉద్యోగాలు పొందినప్పటికీ ఉద్యోగంలో చేరడానికి ఆసక్తి లేక అనివార్య కారణాలతో ఆలస్యంగా ఉద్యోగంలో చేరిన వారు ఉన్నారు. ఉద్యోగంలో చేరి ఇక్కడ నచ్చక తిరిగి ఎలాంటి సమాచారం లేకుండా పోయి తిరిగి వచ్చిన వారు ఉన్నారు. ఇలాంటి వారికి ప్రొబేషన్ ఖరారులో ఆలస్యం అయింది. దీంతో ఏ ప్రతిపాదికన ఉద్యోగోన్నతులు కల్పిస్తారన్న చర్చ జరుగుతోంది.

జాతీయ హాకీ అకాడమీకి

సనప విద్యార్థిని


జాతీయ హాకీ అకాడమీకి ఎంపికైన లక్ష్మి

ఆత్మకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సనప గ్రామానికి చెందిన విద్యార్థిని లక్ష్మి జాతీయస్థాయి హాకీ అకాడమీకి ఎంపికైంది. తమ పాఠశాల పూర్వ విద్యార్థిని ఈ ఘనత సాధించడం పట్ల సనప ఉన్నత పాఠశాల పీడీ నాగరాజు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని లక్ష్మి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిందన్నారు. ప్రస్తుతం కర్ణాటకలోని వడికెర స్పోర్ట్స్ అథారిటీలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. విద్యార్థిని తల్లి శివమ్మ ఆశావర్కర్, తండ్రి పోతులయ్య కూలి పనులకు వెళ్తుంటారన్నారు. తమ కూతురు జాతీయ అకాడమీకి ఎంపికవడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. అకాడమీలో శిక్షణ పొందిన వారు జాతీయ జట్టులో స్థానం సంపాదిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినిని టీచర్లు, గ్రామస్థులు అభినందించారు.

కార్మిక సమస్యలపై ప్రభుత్వం

నిర్లక్ష్యం

వేతన, పీఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప విమర్శించారు. పట్టణంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పంపుహౌస్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్మికుల సమ్మె మంగళవారం పదో రోజుకు చేరుకుంది. సమ్మెకు నల్లప్ప మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అనేక గ్రామాలకు తాగునీరు అందిస్తున్న శ్రీరామిరెడ్డి పథకానికి నిధులు మంజూరు చేయకపోవడం, కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలివ్వకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు వేతనాలు, పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల పక్షాన సీపీఎం ఆందోళనలు చేపడుతుందన్నారు. సమ్మెకు ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలుకా అధ్యక్షుడు చెలిమప్ప మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్, మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామిరెడ్డి కార్మిక నాయకులు వన్నూరుస్వామి, అల్లాబకాష్, గంగాధర, నరేష్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

పొగాకు రైతులకు దళారీ మోసం

పంట కొంటానని హామీ... బాపట్లకు వెళ్లాక చేతులెత్తేసిన వైనం

ధర్నాకు దిగిన అన్నదాతలు

పెద్దవడుగూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దళారీ మాటలు నమ్మి వెళ్లిన రైతులు నాలుగు రోజులపాటు పడిగాపులు కాయాల్సివచ్చింది. మండలంలోని లక్ష్మిపల్లికి చెందిన కొందరు రైతులు పొగాకు దిగుబడిని విక్రయించేందుకు బాపట్ల జిల్లా మేదరమట్ల గ్రామానికి చెందిన హరిబాబు అనే వ్యక్తికి ఫోన్ చేశారు. కొనుగోలు చేస్తానని అతడు చెప్పాడు. దీంతో పదిమంది రైతులు నాలుగు రోజుల క్రితం 50 వాహనాల్లో పొగాకు తరలించారు. రోజులు గడుస్తున్నా హరిబాబు కొనుగోలు చేయకపోవడంతో ఆందోళన చెందిన రైతులు ధర్నాకు దిగారు. జిల్లా యంత్రాంగం స్పందించి, పొగాకు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. బుధవారం కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పినట్లు రైతులు తెలిపారు. నాలుగు రోజులుగా లాడ్జీలో ఉండడానికి, భోజనం తదితరాలు వేల రూపాయలు ఖర్చయినట్లు రైతులు తెలిపారు.

పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది

- సుబ్బారెడ్డి, రైతు, పెద్దవడుగూరు



పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ముందస్తుగా కొనుగోలు ఒప్పందంతో పొగాకు పంట వేశా. బాపట్ల జిల్లా మేదరమట్ల గ్రామానికి చెందిన హరిబాబును కొనుగోలు చేయాలని ఫోన్‌లో సంప్రదించాం. అధిక మొత్తంలో తీసుకొస్తే కొనుగోలు చేస్తానని చెప్పడంతో ఐదు వాహనాల్లో తరలించాం. నాలుగు రోజులు కాలయాపన చేశారు. హోటళ్ల అద్దె వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. దళారీ మాట నమ్మి మోసపోయాం.

ముగిసిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు



ద్వితీయ స్థానంలో నిలిచిన రగ్బీ మహిళల అనంతపురం ఉమ్మడి జిల్లా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 10వ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ మెమోరియల్ రగ్బీ సీనియర్ పురుషులు, మహిళల పోటీలు మంగళవారం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఫైనల్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో నెల్లూరు ప్రథమస్థానం, కర్నూలు ద్వితీయ స్థానం, గుంటూరు తృతీయ స్థానం, అనంతపురం నాలుగో స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో తూర్పుగోదావరి విజేతగా నిలవగా, ఉమ్మడి అనంతపురం జిల్లా రన్నరప్‌గా నిలిచింది. డీఆర్‌ఓ మలోలా, పీటీసీ అడిషినల్ ఎస్పీ మల్లికార్జున వర్మ, ఆర్డీఓ కేశవనాయుడుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జానీశంకర్, కార్యదర్శి సంపత్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసులు రెడ్డి, ఆర్గనైజింగ్ డైరెక్టర్ రాజశేఖర్, మెడికల్ డైరెక్టర్ కృష్ణ, సీనియర్ క్రీడాకారులు బయన్న, శంకర్, తిప్పేస్వామి, కవిత, నిర్మల, భార్గవి, తిరుపాల్, అజయ్ బాబు, సురేష్‌బాబు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని బలవన్మరణం

పది ఫలితాల భయంతో అఘాయిత్యం



సాకే వైష్ణవి (ఫైల్)

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన సాకే కృష్ణయ్య, ధనలక్ష్మి దంపతుల కుమార్తె సాకే వైష్ణవి(15) పదో తరగతి పరీక్షలు రాసింది. పాసవుతానో, కానోననే భయంతో ఆమె మథన పడుతుండేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పనికి బయటకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న వైష్ణవి మధ్యాహ్నం ఫ్యాన్‌కొక్కికి చీరతో ఉరి వేసుకుంది. వైష్ణవి తండ్రి కృష్ణయ్య సాయంత్రం ఇంటికి వెళ్లగా, తలుపులు వేసి ఉండటంతో కిటికీలో నుంచి చూశాడు. ఉరికి వేళాడుతున్న కుమార్తెను చూసి కంగారుగా ఇంటి తలుపులు పగులగొట్టాడు. వైష్ణవిని కిందకు దించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థుల ఆటో బోల్తా

15 మందికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

బొమ్మనహాళ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానాపురం గ్రామ సమీపంలో మలుపు వద్ద మంగళవారం పాఠశాల విద్యార్థుల ఆటో బోల్తా పడి 15 మంది గాయపడ్డారు. మండలంలోని కానాపురం, కొత్తూరు గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు డీ హీరేహాళ్ మండలం సోమలాపురం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆటోలో రోజూ పంపించేవారు. మంగళవారం మధ్యాహ్నం విద్యార్థులు పాఠశాల నుంచి స్వగ్రామాలకు వస్తుండగా కానాపురం సమీపంలోని మలుపు వద్ద డ్రైవర్ చంద్ర నిర్లక్ష్యంతో బోల్తా పడింది. దీంతో శ్రీశాంత్, కావ్యశ్రీ, జయలత, భూమిక, గణేష్, హుస్సేన్, కావేరితోపాటు మరో ఎనిమిది మంది విద్యార్థులు గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. ప్రాణపాయం తప్పినట్లు తెలిపారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కానిస్టేబుళ్లే బలి..!



అవినీతి మరకలున్న ఎస్ఐలు, సీఐలపై చర్యలు శూన్యం

పది నెలల వ్యవధిలో ఇది రెండోసారి..

వీఆర్‌కు ఆదేశాలిచ్చిన వారిపైనా సిఫార్సులు

స్పెషల్ బ్రాంచ్ నివేదికల్లో ఏముంది..?



అనంతపురం క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో అవినీతి మరకలున్న అధికారులపై చర్యలు లేవు. కిందిస్థాయిలో పనిచేస్తున్న కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్లపై చర్యలకు ఉపక్రమించడం విమర్శలకు తావిస్తోంది. పోలీసు స్టేషన్లలో పైసల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించేది ఎస్ఐలు, సీఐలే. ఇదంతా బహిరంగ రహస్యమే. అలాంటి వారిని ఉపేక్షించి తాజాగా కింది స్థాయి సిబ్బందిని వీఆర్‌కు తీసుకురావడం, ఆ క్రమంలోనే సంబంధిత పోలీసు స్టేషన్ నుంచి బదిలీ చేయడం జరిగిపోయింది. పది నెలల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇలా చేస్తున్న పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఏం మెసేజ్ ఇస్తున్నట్లో అర్థం కావడం లేదు. ఎవరి నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకున్నారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ), లా అండ్ ఆర్డర్‌లో పనిచేసే వారి నుంచి నివేదిక తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. లా అండ్ ఆర్డర్‌లో ఎవరెలాంటి నివేదిక ఇస్తారో తెలిసిపోతుంది. ఇక ఎస్బీ.. ఎస్ఐ, సీఐలపై నివేదిక ఇవ్వలేదా...? ఇచ్చినా పోలీసు యంత్రాంగం పక్కన పెట్టిందా...? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్బీలో కొందరు సిబ్బంది దీర్ఘకాలంగా పని చేస్తున్నారు. ఆ క్రమంలో వారికి కూడా పరిచయాలు మరోలా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి పోలీసు అధికారులు ఎస్ఐ ఆపైస్థాయి అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏంటనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది.

అంతటి నిజాయితీపరులా...?

పోలీసు శాఖపై ఎప్పటి నుంచో అలవాటుగా మారిందనే విమర్శను మరోసారి మూటగట్టుకున్నారు. తాజాగా నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లను వీఆర్‌కు తీసుకెళ్లారు. ఏదైనా వివాదంగానీ, శాఖకు మచ్చ తెచ్చే సందర్భాల్లో చిన్న స్థాయి ఉద్యోగులపైనే వేటు వేస్తారనే అపవాదు ముందు నుంచీ ఉంది. పోలీసు స్టేషన్లలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)లు కీలకం. ఎస్ఐ, సీఐలే ఆ సీట్లలో ఉంటారు. వారు చేయని అవినీతి కిందిస్థాయి సిబ్బంది ఎలా చేస్తున్నారో అర్థం కావడంలేదు. మద్యం దుకాణాల నుంచి ప్రతినెలా మామూళ్లు, సెటిల్‌మెంట్లు, ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా, పేకాట ఇలా అన్ని వ్యవహారాల్లో తలదూర్చే పోలీసు అధికారులు జిల్లాలో బాగానే ఉన్నారు. స్టేషన్‌కు వచ్చిన ఆరునెలలకే అతనెలాంటి అధికారో ఆ మండల, స్టేషన్ పరిధిలోని ప్రజలే చెబుతారు. అలాంటిది ఇంత వ్యవస్థ ఉన్న పోలీసు యంత్రాంగానికి ఎస్ఐ, సీఐల అవినీతి తెలియకుండా ఉంటుందనడం అతిశయోక్తే. గత పది నెలల్లో హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవడం ఇది రెండోసారి. గతేడాది ఆఖరులో 15 మందిపై చర్యలు తీసుకున్నారు. మరోసారి 11 మందిని వీఆర్‌కు తీసుకెళ్లి, బదిలీ చేశారు. ఇప్పటివరకు ఎస్ఐ, సీఐలపై మాత్రం చర్యల్లేవు. తాజాగా బుక్కరాయసముద్రంలో అధికార పార్టీ నాయకుడిపై చేయి చేసుకున్నాడనే నెపంతోనే సీఐపై చర్యలు తీసుకున్నారనే విమర్శలున్నాయి. ఇలా ప్రతిసారీ కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకున్నంత కాలం ఆ ఎస్ఐలు, సీఐలు అవినీతిలో మరింత ముదిరిపోతారనడంలో సందేహం లేదు.

వీఆర్‌కు తీసుకొచ్చిన వారిపైనా సిఫార్సులు...

వీఆర్‌కు తీసుకొచ్చిన కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్ల విషయంలోపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లపై చర్యలకు ఉపక్రమించారు. ఇక్కడ కూడా కొందరు సిఫార్సులు చేసి వీఆర్‌కు, బదిలీపై వెళ్లకుండా తప్పించుకున్నట్లు సమాచారం. అధికారపార్టీ నేతలు, పోలీసు శాఖలోనే కొందరి సహకారంతో వారిపై వేటు పడకుండా చూసుకున్నట్లు తెలిసింది. వారిలో అనంతపురం, ఉరవకొండలో ఒక్కో కానిస్టేబుల్‌తోపాటు మరి కొందరున్నట్లు సమాచారం. కళ్యాణదుర్గం పరిధిలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌పై విపరీతమైన ఆరోపణలు వచ్చాయి. ఓ సీఐ సహకారంతో ఆ కానిస్టేబుల్ బదిలీ విషయంలో ఆ సర్కిల్ దాటకుండా వ్యవహారం నడిపారు. వేటుపడిన వారిలో కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమను కనీసం విచారించకుండా ఎలా వీఆర్‌కు పిలవడం, బదిలీ చేస్తారని ప్రశ్నిస్తున్నారు. తాము తప్పు చేసి ఉంటే స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు. ఎస్ఐ, సీఐల స్థాయి కంటే హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఎక్కువ అవినీతి చేస్తారా...? అనే ప్రశ్నకు పోలీసు ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలి.

స్పెషల్ బ్రాంచ్ నివేదిక ఏమవుతోంది...?

పోలీసు శాఖ ఉన్నతాధికారులు స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) ఇచ్చిన నివేదికే ఫైనల్ తీసుకుంటున్నారా..? వాటిని బుట్టదాఖలు చేస్తున్నారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసు శాఖలో ఎస్బీ చాలా కీలకం. ఈ విభాగంలో ప్రభుత్వం మారాక కీలకమైన సీఐలు మారి కొత్తవారు వచ్చారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో హెడ్‌కానిస్టేబుల్ స్థాయిలో ఒకరు ఎస్బీ తరఫున పనిచేస్తారు. జిల్లాలోని దాదాపు 80శాతం పోలీసు స్టేషన్లలో దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారే ఉన్నారు. వీరందరికీ ఆ పోలీసు స్టేషన్‌పై పట్టు ఉంటుంది. సీఐ, ఎస్ఐ స్థాయి అధికారుల వ్యవహారం తెలిసే ఉంటుంది. మరి వారిపై ఎస్బీ సిబ్బంది రిపోర్ట్ స్పష్టంగానే ఉంటోందా..? అనేది అంతుబట్టడం లేదు. వారి కనుసన్నల్లోనే ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ ఇద్దరు, ముగ్గురు కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు డబ్బుల వ్యవహారం నడుపుతుంటారు. ఎస్బీ ఇచ్చిన నివేదికలు స్పష్టంగా ఉంటే పోలీసు యంత్రాంగం వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నకు సమాధానం లేదు. ఎస్బీలోనూ కొందరు పోలీసు శాఖలో ఉన్నతాధికారులకు సహకరిస్తుంటారనే ఆరోపణలున్నాయి. వైసీపీ హయాం నుంచి ఎస్బీలోనే అధిక శాతం పనిచేస్తున్నారు. మరికొందరు ఆ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు కీలకంగా పనిచేసే కిందిస్థాయి సిబ్బందితో కుమ్మక్కై మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు లేకపోలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10నెలలు దాటినా ఇప్పటి వరకు ఒక్క ఎస్ఐ, సీఐపై చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.

వక్ఫ్ బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు సరికాదు

చంద్రబాబు, పవన్ కల్యాణ్ నోరు విప్పాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపాటు



మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చారో చెప్పాలంటూ నిలదీశారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన ఉమ్మడి జిల్లా సీపీఐ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ మతాల మధ్య చిచ్చు పెట్టి, మైనార్టీలను టార్గెట్ చేస్తూ ఏదో చేయాలని చూస్తోందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుపై దేశవ్యాప్తంగా మైనార్టీలు, లౌకిక వాదులు నిరసన గళం విప్పుతున్నారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26ను కేంద్రం ఉల్లంఘిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో సైతం ఇతర మతస్థులను పెట్టాలని చూడటం సరికాదన్నారు. ఇది ముస్లింలతోనే ఆగదని, తర్వాత క్రిస్టియన్ ప్రాపర్టీలు, దేవదాయ భూములను టార్గెట్ చేస్తారంటూ విమర్శించారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన సవరణలు వక్ఫ్ బిల్లులో అమలు చేయకపోయినా ఎందుకు ఆమోదం తెలిపారో చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ వేషం మార్చి సనాతనవాదిని అంటూ కాషాయం డ్రెస్సులు వేసుకుని, పూర్తిగా బీజేపీ అజెండాతో నడుస్తున్నాడని మండిపడ్డారు. తిరుపతి గోశాలలో గోవుల మృతిపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన చేసిన ఆరోపణలపై సున్నితంగా పరిష్కరించాల్సింది పోయి, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఆట్లాడటం సరికాదన్నారు. దేశంలోని బ్యాంకుల్లో వేల కోట్లు కొల్లగొట్టి విదేశాలకు పారిపోయిన కోటీశ్వరులు సుమారు 20 మంది వరకూ ఉన్నారని, వాళ్లను రప్పించి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ఇతర నేతలు కేశవరెడ్డి, లింగమయ్య, రమణయ్య, సంతోష్‌కుమార్, అల్లిపీరా తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జగదీష్



మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు టౌన్(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో మంగళవారం వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ ఖాజీ రజాక్ పీర్, అదనపు ఖాజీ సత్తార్‌సాబ్, ముస్లిం మతపెద్దలు, మైనార్టీ నాయకులు, కాంగ్రెస్, వైసీపీ నాయకులు హాజరయ్యారు. జగదీష్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ నిరంకుశ పాలనకు కొందరు జీహుజూర్ అంటున్నారన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు తీవ్ర అన్యాయం వాటిల్లుతుందన్నారు. కులమతాలకు అతీతంగా వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకునేలా కేంద్రంపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్ పాల్గొన్నారు.

సీఐ డ్రైవరే దొంగ!

మూడు వరుస చైన్‌స్నాచింగ్‌లు ఇతడి ఘనతే

పోలీసుల అదుపులో ఐదుగురు చైన్‌స్నాచర్ల ముఠా

నేడు మీడియా ముందుకు..

అనంతపురం క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుసగా మూడు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన దొంగ ఓ సీఐ డ్రైవర్‌గా పని చేసినట్లు సమాచారం. ఆ సీఐ ఆ దొంగకు గతంలో ఇచ్చిన బైక్‌నే చైన్ స్నాచింగ్ లకు ఉపయోగించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడితో పాటు మరో రెండు బృందాల చైన్‌స్నాచర్ల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే ఓ వ్యక్తి గతంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే అధికారులకు డ్రైవర్‌గా పని చేసేవాడు. అదే క్రమంలో ఓ అధికారికి డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో ఆ అధికారి అతడికి తాను వాడే బైక్ ఇచ్చారట. ప్రస్తుతం ఆ సీఐ ఓ ప్రత్యేక విభాగంలో పని చేస్తున్నారు. అనంతపురం నగరంలోని మూడో రోడ్డుకు చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ భార్య దేవి వారం రోజుల కిందట రాప్తాడుకు స్కూటీలో బయలుదేరారు. నగరశివారులోని హార్మోన్‌సిటీ సమీపంలో ఓ దొంగ అటకాయించి ఆమె మెడలోని మూడుతులాల బంగారు గొలుసు తస్కరించాడు. ఈ ఘటనపై పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా అతను వాడిన బైక్ ఆధారంగా వివరాలు ఆరా తీశారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తే... ఈనెల ఏడో తేదీ తపోవనం సమీపంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రావణి మెడ నుంచి మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లింది కూడా అతనేనని తేలింది. రెండు వారాల రోజుల కిందట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళ నడిచి వెళ్తుండగా ఒకటిన్నర తులం బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఈ మూడు ఘటనలకు పాల్పడిన దొంగను సంబంధిత సీఐ విభాగం సిబ్బందే అదుపులోకి తీసుకుని విచారించార ట. పోలీస్ అధికారులకు డ్రైవర్‌గా పనిచేసిన ఈ దొంగ మరెన్ని ఘటనలకు పాల్పడ్డాడో పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది.

పోలీసుల అదుపులో ముఠా...

ప్రస్తుతం పోలీసులు మరో రెండు చైన్‌స్నాచర్ల ముఠాలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఓ గ్రామ సమీపంలో వృద్ధురాలిని గాయపరిచిన దొంగ ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఆ వృద్ధురాలు గాయపడి కొంతకాలానికే మృతి చెందింది. ఆ ఘటనకు పాల్పడిన ఇద్దరు దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరితో పాటు మరో ఇద్దరి ముఠాను అరెస్ట్ చేసినట్లు తెలిసింది. వీరిలో ఎక్కువ మంది ఐపీఎల్ నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పులు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడి ఆ బంగారాన్ని అమ్మి సొమ్ము చేసుకోవాలని భావించి పోలీసులకు దొరికిపోయారు. వారిని బుధవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,560 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 774 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేపడతామని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కారరావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని క్లాక్ టవర్ సమీపంలో గల ఓహోటల్లో మంగళవారం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి వైద్యసిబ్బందికి అనేక యాప్‌లు పెట్టి పని చేయించడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్దుబాటు చేసిన ఉద్యోగులకు చాలాచోట్ల జీతాలు రావడంలేదని ఆ సమస్య పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆసంఘం నాయకులు బాబాసాహెబ్, నూర్‌బాషా, ప్రకాష్ చౌడప్ప, సావిత్రి, ఫయాజ్, విశ్వనాథ్, ముంతాజ్, త్రివేణి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

18న దివ్యాంగుల క్రికెట్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 18న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం అధ్యక్షుడు శంకరనారాయణ తెలిపారు. ఆసక్తి, అర్హతగల దివ్యాంగ క్రీడాకారులు ఆధార్ కార్డు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సదరం సర్టిఫికెట్, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలు, పేర్ల నమోదుకు 9703400870, 6305354511, 9398509469 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఎంపికైన దివ్యాంగ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు.

పామిడి విద్యార్థినికి మంత్రి లోకేశ్ అభినందన

పామిడి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థిని మహేంద్రకర్ ధృతికాబాయి ఎంపీసీలో 987 మార్కులు సాధించడంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ అభినందించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ధృతికాబాయిని మంత్రి మంగళవారం అభినందించి, గోల్డ్ మెడల్, ల్యాప్‌టాప్ అందజేశారు. పట్టణానికి చెందిన మహేంద్రకర్ శ్రీనివాసరావు, రమాబాయి దంపతుల కుమార్తె ధృతికాబాయి ఎమ్మిగనూరు ఏపీఆర్‌జేసీ బనవాసి గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదువుతోంది. ఇంటర్మీడియట్ ద్వితీయ పరీక్షలు రాసింది. పరీక్షల ఫలితాల్లో ఏకంగా 987 మార్కుల సాధించి, శెభాష్ అనిపించుకుంది.



ధృతికాబాయికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న మంత్రి నారా లోకేశ్

జిల్లా న్యాయాధికారికి ఎస్పీ సన్మానం



జిల్లా న్యాయాధికారిని సన్మానిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్‌ను ఎస్పీ జగదీష్ సన్మానించారు. జిల్లా న్యాయాధికారి బంగ్లాకు ఎస్పీ మంగళవారం వెళ్లి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. పోలీసు, న్యాయశాఖలు పరస్పర సహకారంతో నేరస్థులకు శిక్షలు పడేలా చేయడాన్ని గుర్తుచేశారు.

ఖో-ఖోలో ఎస్కేయూ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కేఎస్ఎన్ఆర్ జాతీయస్థాయి ఖో-ఖో పోటీల్లో ఎస్కేయూ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కడప కేఎస్ఆర్ఎం కళాశాలలో ఈనెల 12 నుంచి మూడు రోజులపాటు జాతీయస్థాయి పోటీలను నిర్వహించారన్నారు. పోటీల్లో ఇంజినీరింగ్ జట్టు రన్నర్‌గా నిలిచిందన్నారు. మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర.. విద్యార్థులను అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జి శివానంద, అధ్యాపకులు షాషావలి, రాజేష్‌బాబు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

నంబులపూలకుంట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను బుధవారం నిర్వహిస్తున్నామని, ఇందులో ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ పాల్గొంటారని మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జీ దండే రవిశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తారని, అర్జీదారులు తప్పకుండా ఆధార్, ఫోన్ నంబర్లు జతపరచాలని సూచించారు.

ప్రతి కార్యకర్తనూ అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'అధికారంలో ఉన్నా.. లేకపోయినా 20 సంవత్సరాలుగా నాకు మీరు... మీకు నేను తోడుగా ఉంటున్నాం. మీ కష్టాలు.. నష్టాలు.. నాకు తెలుసు. మీ అందరిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నా. పార్టీ అధికారంలో ఉన్నా.. లేకపోయినా నేను చేపట్టబోయే కార్యక్రమం ద్వారా ఆర్థికంగా బలోపేతం అవుతారు.' అని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక పీవీఆర్ గ్రాండ్‌లో నిర్వహించిన తలుపుల మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో కంటే అధికార పక్షంలో ఉన్నప్పుడే బాధ్యతగా అందరూ పని చేయాలన్నారు. అధికారం ప్రజాసేవకు ఉపయోగించాలే తప్ప ప్రజలపై పెత్తనం చెలాయించడానికి కాదన్నారు. 11 నెలలుగా మండలంలో నెలవారీ సమావేశాలు నిర్వహించలేదని, ఇక ప్రతినెలా మండలంలో ముఖ్య నాయకులు సమావేశం కావాలని, మనస్పర్థలు వీడి ప్రతి సమస్యనూ చర్చించుకోవాలన్నారు. సమావేశంలో తలుపుల మండల కన్వీనర్ ముబాకర్, నాయకులు గరికపల్లి రామక్రిష్ణారెడ్డి, ఆవుల మనోహర్‌రెడ్డి, విజయారెడ్డి, రాజారెడ్డి, వీరభార్గవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కదిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తమరే కేటాయించిన స్థలాన్ని దళారులు ఇతరులకు కేటాయించారని, అర్హులైన తమకు ఆ స్థలం, ఇళ్లు కేటాయించాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ వీవీఎస్ శర్మకు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. 2007లో భవన నిర్మాణ కార్మికులకు పట్టాలు ఇచ్చారని, అందులో ప్రస్తుతం ఎక్కువ మంది అనర్హులున్నారని వాపోయారు. అధికారులు స్పందించి విచారణ చేసి, అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంబులపూలకుంట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఆంజనప్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు వారు స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా సచివాలయాల్లో దరఖాస్తులను మే 10లోపు అందచేయాలన్నారు.

రక్తబంధం ట్రస్ట్ అధ్యక్షుడికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న కన్న వెంకటేశ్

ధర్మవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రక్తబంధం, రజిని ట్రస్ట్‌ల అధ్యక్షుడు కన్నవెంకటేశ్‌కు జాతీయ అవార్డు లభించింది. రాష్ట్రంలో నిస్వార్థంగా సమాజానికి సేవలందిస్తున్న వారిని గుర్తించి డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా విజయవాడలోని సిద్ధార్థ కాలేజ్ ఆడిటోరియంలో సోమవారం అవార్డులను అందించి సన్మానించారు. ఆ అవార్డుకు కన్నవెంకటేశ్ ఎంపికయ్యారు. దీంతో ఆయనకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసులు, కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి, మాజీ మంత్రి కైకలూరు ఆ అవార్డు అందజేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ధర్మవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం అగ్నిప్రమాదాలు వాటి నివారణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, కళాజ్యోతి, ఎన్టీఆర్ సర్కిళ్లలో అగ్నిమాపక కేంద్రాధికారి ఎం.రాజు ఆధ్వర్యంలో వాటర్ డెమో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

● కదిరి : ప్రజలు అప్రమత్తంగా ఉండే అగ్నిప్రమాదాలు నివారించవచ్చని ఇన్‌ఛార్జీ అగ్నిమాపక అధికారి శ్రీధర్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో వివిధ రకాల విన్యాసాలు చేసి అవగాహన కల్పించారు. కరపత్రాలు అందించారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై వేధింపులకు నిరసన

ధర్మవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో అంగన్‌వాడీ టీచర్‌ను మోసం చేసి రూ. లక్ష ఇప్పించుకోవడమే కాకుండా.. లైంగికంగానూ వేధించిన టీడీపీ నాయకుడిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, హైదర్‌వలీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పోతక్క, అరుణ, టీచర్స్ రత్నమ్మ, జ్యోతి, శకుంతల, రాజీ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

పుట్టపర్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు వాడినా, అమ్మినా వారిపై జరిమానాలతో పాటు చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య తెలిపారు. మంగళవారం పర్యావరణ కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, ఉమాశంకర్‌తో కలిసి ఎనుములపల్లి వారపు సంతలో తనిఖీ చేపట్టారు. ఎవరు ప్లాస్టిక్ కవర్లు వాడరాదని సూచించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



బుక్కపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామివారికి 11 రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. రాత్రి స్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించారు.

ఆదుకుంటున్న అన్న క్యాంటీన్లు

- పేదల ఆకలి తీర్చడానికి ప్రారంభించిన టీడీపీ
- వైసీపీ హయాంలో మూసివేసిన వైనం
- మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో పూర్వవైభవం
- హర్షం వ్యక్తం చేస్తున్న నిరుపేదలు, గ్రామీణులు



ధర్మవరంలో అన్న క్యాంటీన్ వద్ద క్యూ

ధర్మవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, అభాగ్యుల కడుపు నింపి.. వారి ఆకలి బాధ తీర్చడానికి 2018లో నాటి సీఎం చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 14 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. అనంతపురంలో మూడు, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, సత్యసాయి జిల్లాలో హిందూపురం, పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, మడకశిరలో ఒక్కొక్కటి, ధర్మవరంలో రెండు క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. తక్కువ ధరకే టిఫెన్, భోజనం లభిస్తుండటంతో పేదలు, కార్మికులు, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభించింది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అన్నక్యాంటీన్లను మూసివేసి... పేదల కడుపు కొట్టింది. అంతేకాకుండా కొన్ని ప్రాంతాల్లో ఆ క్యాంటీన్ భవనాలను సచివాలయాలుగా మార్చేసింది. నిరుపయోగంగా మారిన మరికొన్ని క్యాం టీన్ల భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. 2024లో మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే తిరిగి ఆ అన్నక్యాంటీన్లను ప్రారంభించి.. పేదల కడుపులు నింపుతోంది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● ధర్మవరంలో ప్రభుత్వ ప్రభుత్వాస్పత్రి, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఈ క్యాంటీన్లను ఏర్పా టు చేశారు. ఒక్కో అన్నక్యాంటీన్‌లో రోజుకు దాదాపు 3000 మంది భోజనం, అల్పాహారం చేస్తుంటారు. పట్టుకేంద్రమైన ధర్మవరం పట్టణానికి ప్రతి రోజు వివిధ పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి ప్ర జలు వస్తుంటారు. ఇక్కడ హోటళ్లలో టిఫెన్ చేయాలంటే రూ.40, భోజనం చేయాలంటే రూ.70 ఖర్చు చేయాల్సి వచ్చేంది. దీంతో పేదలు, గ్రామీణులు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. అయితే అన్న క్యాంటీన్ ఏర్పాటుతో కేవలం రూ. 5లకే టిఫెన్, భోజనం అందిస్తూ ప్రభుత్వం వారికి అండగా నిలిచింది.

● ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి టిఫెన్, భోజనం లభిస్తోంది. అన్నక్యాంటీన్‌లో టిఫెన్ ఇడ్లీ, ఉప్మా, పొంగల్, పూరి, భోజనం అన్నం, పప్పు, సాంబార్, పచ్చడి, పెరుగు లభిస్తాయి. ఉదయం 7-30 నుంచి 10 గంటల వరకు టిఫెన్, భోజనం మధ్యాహ్నం 12-30 గంటల నుంచి 3 గంటల వరకు, రాత్రి 7-30 గంటల నుంచి 9 గంటల వరకు అన్న క్యాంటీన్లు తెరచి ఉంటాయి. దీంతో కళాశాలలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు సమయానికి ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చుకోక పోతే అన్నక్యాంటీన్లు ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వాస్పత్రి అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడంతో.. దూర ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే ప్రజలకు ఎంతో ఆసరాగా ఉంటోంది'



భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

భోజనం బాగుంది



గ్రామీణ ప్రాంతం నుంచి పని నిమిత్తం పట్టణానికి వస్తుంటాం. ఇది వరకే హోటల్‌లో టిఫెన్ చేయాలంటే రూ.40, భోజనం చేయాలంటే రూ.70 ఖర్చు పెట్టేవాళ్లం. కానీ ఇక్కడ రూ.5లకే టిఫెన్, రూ. 5లకే భోజనం పెడుతున్నారు. అందులోనూ నాణ్యమైన రుచికరమైన టిఫెన్, భోజనం పెడుతున్నారు.

\- మొర్రెడ్డి, మేడాపురం, సీకేపల్లి మండలం

గ్రామీణులకు మేలు



ఈ అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇక్కడే భోజనం చేస్తున్నా. గతంలో రూ.70 చెల్లించి హోటళ్లలో భోజనం చేసేవాళ్లం. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని పట్టణాల్లో అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేయడం సంతోషం. పేదల కడుపు నిండుతోంది.

\- నల్లప్ప, గొట్లూరు, ధర్మవరం మండలం

పేదలకు ఆదుకుంటోంది



ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్లు పేదలను ఆదుకుంటున్నాయి. ముఖ్యంగా పట్టణాలకు కూలి పనులకు వచ్చే వారికి మరీ అవసరం. ప్రభుత్వాస్పత్రి వద్ద ఏర్పాటుచేసిన అన్నక్యాంటీన్ వల్ల ఆస్పత్రికి వచ్చే గ్రామీణ ప్రాంత రోగులకు, వారి బంధువులకు ఎంతో ఉపయోగం. బయటకువెళ్లి హోటల్లో తినాలంటే డబ్బులు చాలా ఖర్చు అవుతాయి. కానీ అన్నక్యాంటీన్‌లో అయితే రూ.5లకే రుచికరమైన భోజనం పెడుతున్నారు.

\- పార్వతమ్మ, ధర్మవరం

వడ్డీతోనే పంట రుణాలు రెన్యువల్ చేయాలి



యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొత్తచెరువు, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): వడ్డీ మాత్రమే కట్టించుకొని బ్యాంకుల్లో పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని ఏపీ రైతుసంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక యూనియన్ బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్లకు మంగళవారం వినతిపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ... పంటరుణాలు ష్యూరిటీ లేకుండా ఇవ్వాలన్నారు. కొంతమంది దళారులు రెన్యువల్ కోసం రైతులకు అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్నారని, అటువంటి వారిని బ్యాంకుల దరిదాపులకు కూడా రాకుండా చూడాలని వారు కోరారు. అదేవిధంగా బ్యాంకు సిబ్బంది కూడా దళారులతో కుమ్మక్కై.. ముందుగా రెన్యువల్ కోసం ఇచ్చిన వారి ఫైళ్లు పక్కన పెట్టి... దళారులు ఇచ్చిన ఫైళ్లను మాత్రమే రెన్యువల్ చేస్తున్నారని, దీంతో నిజమైన రైతులకు అన్యాయం జరుగుతోందని, ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, నాయకులు వీవీ రమణ, సుధాకర్‌రెడ్డి, వక్రుద్దీన్, మారుతి పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కుమార్ రెడ్డి పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న పవన్‌కుమార్ రెడ్డి

కదిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. మంగళవారం పవన్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఆయనకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పన్‌కుమార్‌రెడ్డి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో హరిమోహన్, గోపాలక్రిష్ణ, సురేంద్రరెడ్డి, బాషా, నరసింగరావు, ఆంజనేయులు, శ్రీరాములు, వెంకట రమణారెడ్డి, తలుపుల బాషా, సోమిరెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు. కాగా, వాల్మీకి విద్యా సంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అనిల్ కుమార్‌రెడ్డి, అలీబాషా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచారు.

మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్ కొనసాగింపు



కదిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్‌కుమార్‌ను మరో ఏడాది పాటు కొనసాగిస్తూ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హార్టికల్చర్ ఏడీగా ఉన్న కిరణ్‌కుమార్‌ను నాలుగు సంవత్సరాల క్రితం మున్సిపల్ శాఖకు బదిలీ చేశారు. కదిరి మున్సిపల్ కమిషనర్‌గా ఆయన విధుల్లో చేరి సంవత్సరమైంది. ఈ సంవత్సరం మార్చి నాటికి ఆయన మున్సిపల్ శాఖకు బదిలీ అయి నాలుగు సంవత్సరాలు పూర్తి అయింది. దీంతో ఆయన సొంత శాఖకు వెళ్లాల్సి ఉంది. అయితే పరిపాలన సౌలభ్యం కోసం మున్సిపల్ కమిషనర్‌గా ఆయన సర్వీసును మరో సంవత్సరం పొడిగించారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఉపాధి బిల్లులు చెల్లించండి

తనకల్లు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన బిల్లులు పది వారాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే తమ ఖాతాలో జమ చేయాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కదిరప్ప మాట్లాడుతూ..ఉపాధి హామీ చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని, ఇందులో రాజకీయ నాయకుల జోక్యం పూర్తిగా నివారించాలని డిమాండ్ చేశారు. పనిదినాలను 200 రోజులకు, దిన కూలిని రూ.700కు పెంచాలన్నారు. అనంతరం ఎంపీడీఓ రెడ్డెప్ప, ఏపీఓ మరియమ్మకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో సీపీఐ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, ఆనంద్, రవి, రవినాయక్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వ్యాపారాలు



ఆటోల్లో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు

నల్లమాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి మంగళవారం వారపు సంత జరుగుతుంది. ఈ వారపు సంత తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో నిర్వహిస్తారు. కార్యాలయం వద్ద కదిరి, పుట్టపర్తి ప్రధాన రోడ్డు ఉంది. వ్యాపారులు కార్యాలయం ఆవరణంలోని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటే సమస్య ఉండదు. వ్యాపారులు కార్యాలయ గేటు నుంచి వరలక్ష్మీ హోటల్ వరకు రోడ్డుకు ఒక పక్కన దుకాణాలు, ఆటోలో వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైన వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

అయ్యప్ప ఆలయ పరిశీలన

ధర్మవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవనగర్‌లో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయాన్ని మే 14న ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు మంగళవారం ఆ ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు బీవీప్రకాశ్, గురుస్వామి విజయ్‌కుమార్‌తో వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఆలయానికి వెళ్లే రహదారి మరమ్మత్తు, వీధిదీపాల నిర్వహణ, కాలువల శుభ్రత, అదనపు విద్యుత్ లైటింగ్ తదితర వాటిపై చర్చించారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించే దిశగా మున్సిపల్, విద్యుత్, పోలీసు, ఆరోగ్యశాఖల మధ్య సమన్వయంతో ఏర్పాట్లు చేపడుతామన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

క్రైం న్యూస్..

నలుగురిపై కేసు నమోదు

ముదిగుబ్బ, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేగేటు కొట్టాలలో చలివేంద్రం ఏర్పాటు విషయంలో ఇరువురి ఫిర్యాదులతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు. గేటు కొట్టాలలో టీడీపీకి చెందిన వారు చలివేంద్రం ఏర్పాటు విషయంలో వైసీపీకి చెందిన బాబ్జాన్ అడ్డు పడ్డాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో బాబ్జాన్ సోమవారం విషద్రావకం తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతను మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పరస్పర ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దాడి చేసిన ఇద్దరిపై..

ధర్మవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన సురేశ్ రామాంజినేయులుకు ద్విచక్రవాహనాన్ని కంతులకు ఇప్పించాడు. రామాంజినేయులు కంతులు సక్రమంగా కట్టలేదు. దీంతో కంతులు క్రమం తప్పకుండా కట్టాలని సూచించినందుకు రామాంజినేయులు, అతని భార్య ఉష సురేశ్‌పై మంగళవారం దాడి చేశారు. సురేశ్ ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముదిగుబ్బ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక దొరిగల్లు రోడ్డు సమీపంలోని ఓ రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 33 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు. ధర్మవరానికి చెందిన శ్రీనివాసులు ముదిగుబ్బ చుట్టుపక్కల ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెల్సిందన్నారు. ఆ బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

ముగ్గురికి స్వల్పగాయాలు



దెబ్బతిన్న ప్రైవేటు బస్సు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో సోమవారం అర్ధరాత్రి ఆగి ఉన్న లారీని ప్రైవేటు బస్సు ఢీకొంది. నెల్లూరు జిల్లా పొళ్యం నుంచి బెంగుళూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ప్రమాదంలో బస్సులో ఉన్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

బీజేపీలో పలువురి చేరిక

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నూరు బత్తలపల్లి గ్రామానికి చెందిన గడుపూటి నాగభూషణం ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌లు వెంకటరాముడు, పులమరాజు వారి అనుచరులు బీజేపీలోకి చేరారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌డీఏ కార్యాలయంలో వీరిని మంత్రి నియోజవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో బీజేపీ మండల కన్వీనర్ గొట్లూరు చంద్ర, నాయకులు భక్తవత్సల నాయుడు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ సిలబస్ తగ్గించాలి

కొత్తచెరువు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిషులో అదనంగా సిలబస్ ఉండటం వల్ల 9, 10 తరగతి విద్యార్థులకు సకాలంలో పాఠాలను పూర్తి చేయలేకపోతున్నామని, సిలబస్ తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ కిష్టప్పకు మంగళవారం వినతి పత్రం ఇచ్చిన వారు మాట్లాడారు. 9, 10 తరగతుల్లో 9 యూనిట్లు అదనంగా సప్లమెంటరీ రీడర్, వర్క్ బుక్కులు ఉన్నాయని, అధికంగా ఉన్న సిలబస్ వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇంగ్లిషులో సిలబస్ తగ్గించేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగభూషణ, రవీంద్రారెడ్డి, వెంకటరాముడు, రేష్మాబాను,ఎల్వీరమణ, బాబు, రామ్మూర్తి, నరసింహులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఎవరినీ కులం పేరుతో దూషించలేదు

తాడిమర్రి కురుబ టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న రాగే యల్లప్ప, నాయకులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తాడిమర్రి మండలంలోని చిత్రావతి రిజర్వాయర్‌లో చేపలు పట్టే విషయంలో జరిగిన గొడవలో తాము ఎవరినీ కులం పేరుతో దూషించలేదని ఆ మండల కురబ సాధికార సమితి మాజీ డైరెక్టర్ రాగే యల్లప్ప, టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మునుగు శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం వారు ధర్మవరంలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మండల కన్వీనర్ కూచిరాము కులం పేరుతో దూషించాడని ఆరోపణలు చేయడం తగదన్నారు. కొంకా నాగార్జున ఎన్నికల వరకు వైసీపీ కోసం పని చేశారని, కురుబలంతా వైసీపీకి ఓటువేయాలని ప్రచారం కూడా చేశాడని, ఆ పార్టీ ఓడిపోవడంతో ఇప్పుడు బీజేపీలోకి చేరి ఇలా నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. ఆర్వేటి ఆనంద్ ఎన్నికల ముందు టీడీపీలో చేరాడని, అతనికి ఫీల్డ్‌అసిస్టెంట్ ఇవ్వలేదని మళ్లీ బీజేపీలో చేరాడని అన్నారు. ఇప్పుడు వీరు టీడీపీ నాయకులపై దుర్భాషలాడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకుల్లో ఎంత మంది సత్యకుమార్ గెలుపు కోసం పని చేశారో గుండెల మీద చేయివేసుకుని చెప్పాలన్నారు. ఈ విషయాన్ని బీజేపీ నాయకులు, మంత్రి సత్యకుమార్ గమనించి.. గెలుపు కోసం పనిచేసిన వారిని గుర్తించాలని కోరారు. ఇలాంటి స్వార్థ వలస పక్షులను దూరం ఉంచాలన్నారు. కార్యక్రమంలో తాడిమర్రి టీడీపీ నాయకులు ఆకులేటి లక్ష్మీనారాయణ, నాయనపల్లి గంగాధర్, కప్పల గంగయ్య, నరేష్, పార్థ, నరసింహ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు



పెనుకొండ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు పేర్కొన్నారు.

ప్రశ్న: తాగునీటిఎద్దడి నివారణకు చర్యలు ఏవి?

డీఈ: తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి బోర్లు వేయించి సమస్యను తీరుస్తాం.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డీఈ: గ్రామాల్లో తాగునీటి బోర్లు వేయిస్తున్నాం. నీరు పుష్కలంగా లభ్యమవుతోంది.

ప్రశ్న: పెనుకొండ నియోజకవర్గంలో ఎన్ని గ్రామాల్లో తాగునీటి నివారణకు చర్యలు చేపడుతున్నారు?

డీఈ: నియోజకవర్గవ్యాప్తంగా 58గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లు గుర్తించాం. పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: నియోజకవర్గ వ్యాప్తంగా ఎంత నిధులు మంజూరయ్యాయి?

డీఈ: బీసీ సంక్షేమం చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చొరవతో జలజీవన్ మిషన్ కింద రూ.25కోట్లు మంజూరయ్యాయి. ఇదివరకే పెనుకొండ నియోజకవర్గం శెట్టిపల్లిలో బోర్లువేశాం. వాటికి విద్యుత్ మోటార్లు అమర్చి పైప్‌లైన్ ద్వారా ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ద్వారా ప్రతి ఇంటికి కొళాయి ద్వారా నీటిని అందిస్తున్నాం.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ నాయకుడు బాబావలి



ఆందోళన చేస్తున్న కార్మికులు

పెనుకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు బాబావలి డిమాండ్ చేశారు. కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పే ఆలోచనను మానుకోవాలని కోరుతూ నగర పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సమానపనికి సమానవేతనం అందిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలను నెరవేర్చాలన్నారు. ఆప్కాబ్‌ను రద్దుచేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉందని, ఆ ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కమిషనర్ సతీష్‌కుమార్‌కు అందజేశారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, చంద్ర, ఈ వెంకటేష్, నరసింహ, సుదర్శన్, లక్ష్మీదేవి, నరసమ్మ, సీఐటీయు నాయకుడు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో వైసీపీ నాయకుడు వేణురెడ్డి

పరిగి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): హిందూపురం వైసీపీ సమన్వయకర్త దీపిక భర్త వేణురెడ్డిని మంగళవారం ఉదయం ముందస్తు అరెస్ట్‌చేసి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ ఆంజనేయులు, ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రకటించడంతో అల్లర్లు చెలరేగకముందే ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న హిందూపురం వైసీపీ నాయకులు, కార్యకర్తలు పరిగి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అతడిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐ ఆంజనేయులు రావడంతో నాయకులు, కార్యకర్తలు స్టేషన్ వద్ద నుంచి వెళ్లిపోయారు. సొంత పూచీకత్తుతో వేణురెడ్డిని మధ్యాహ్నం ఒంటి గంటకు విడుదల చేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశులు సూచించారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో డెమోద్వారా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

'రాజ్యాంగ హక్కులు ప్రతి ఒక్కరికీ కల్పించాలి'

పావగడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాజ్యాగం కల్పించిన హక్కులు ప్రతిఒక్కరూ పొందాలని పావగడ పావగడ సర్వధర్మశాంతి పీఠం అధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ అన్నారు. వీరమ్మనహళ్లి గ్రామానికి చెందిన నిరాశ్రయ మహిళకు తనవంతు సాయం ఆయన చేశారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగం దేశానికి రక్షణకవచంలాంటిదన్నారు. ప్రతి ఒక్కరికీ మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



అగళి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని హళ్లికెర గ్రామంలో మంగళవారం వీరముత్తప్ప విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంగా వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవనహళ్లి కంకణ కలశ స్థాపన పంచామృతాభిషేకం, అంకురార్పణ యాగం, మండప ప్రవేశం, గణపతి హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం గావించారు.

వేసవిలో నీటి సమస్య అధిగమిద్దాం

అధికారుల సమీక్షలో మున్సిపల్ చైర్మన్



గొల్లపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే పీఏ, కమిషనర్

హిందూపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వేసవిలో పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు సమష్టిగా పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ ఎమ్మెల్యే పీఏ వీరయ్య సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నీటి విభాగం అధికారులు, సిబ్బందితో కమిషనర్ శ్రీనివాసులుతో కలిసి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వేసవి మొదలైందని, నీటి సమస్యతో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ఇప్పటికే గొల్లపల్లి వద్ద కొత్తమోటారు ఏర్పాటు చేయడం జరిగిందని లీకేజీలు కూడా లేకుండా చూస్తామన్నారు. దీనితోపాటు వార్డుల్లో కొళాయి నీరు వచ్చే విధంగా చూడాలన్నారు. నీటి సమస్యను ఎవరైనా అధికారుల దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరించాలన్నారు. ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం గొల్లపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించారు. వెంకటాపురం తండా, ఎస్‌కెడి నగర్, కొల్లకుంటవద్ద ఉన్న డబ్ల్యుటీపీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. అక్కడ ఏదైనా పరికరాలు అవసరమైతే అప్పటికప్పుడు కొనుగోలుచేసి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం హిందూపురం 9ఎంఎల్‌డి నీరు వస్తుందని ఫిల్టర్ బెడ్స్ శుద్ధి యంత్రాలు, మోటార్లను మరమ్మతులు చేయిస్తే సామర్థ్యం పెంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈ మోహన్, డీఈ ఆనందరాజు, ఏఈ జనార్దన్, దుర్గానవీన్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో విచారణ.. ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి, ఉద్యోగి మధ్య వివాదంపై ఓవైపు విచారణ సాగుతుండగానే.. మరోవైపు ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించడంతో సిబ్బంది మంగళవారం పోలీసులకు మరోమారు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణ విషయంలో పోస్టుమార్టం అసిస్టెంట్ రాధమ్మ, వైద్యాధికారి వినోద్‌కుమార్ మధ్య రెండువారాల క్రితం ఘర్షణ జరిగింది. ఉద్యోగి భర్త నరేంద్ర.. వైద్యాధికారిపై దుర్భాషలాడాడు. తరువాత రాధమ్మ ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో వైద్యాధికారి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్ ఇరువురిని విచారించారు. దీనిపై ఈనెల 3న 'వైద్యాధికారిపై దుర్భాషలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. నైట్ డ్యూటీ వేయడంతో ఇరువురి మధ్య వివాదం తలెత్తింది. ఉన్నతాధికారుల ఆదేశంతో పగటి వేళ్లలో రాధమ్మ పనిచేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా వైద్యాధికారి ఫైరోజాబేగం, డీసీహెచ్ఎస్ తిప్పేందనాయక్ గోరంట్ల ఆసుపత్రిలో మంగళవారం సమగ్ర విచారణ చేపట్టారు. విచారణ ఏకపక్షంగా సాగిందని రాధమ్మ మంగళవారం విషపు గుళికలు మింగి, ఆత్మహత్యకు యత్నించారు. ఈ విషయాన్ని ఆమె భర్త సోషల్ మీడియాలో పోస్ట్‌చేశారు. విషయం తెలుసుకున్న డాక్టర్ వినోద్‌కుమార్.. సిబ్బంది ద్వారా ఆమెకు చికిత్స చేయాలని ప్రయత్నించగా, ఆమె నిరాకరించినట్లు చెప్పారు. దీంతో చేసేదిలేక డాక్టర్లు వినోద్‌కుమార్, వేణుగోపాల్, ఉషాతోపాటు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనారోగ్యంతో ఉన్న తనను వేధిస్తుండడంతో ఆత్మహత్యకు యత్నించాననీ, బదిలీ చేస్తే వెళ్లిపోతానని రాధమ్మ తెలిపారు. తొలుత వివాదం తలెత్తినపుడే అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టి ఉండుంటే మరో ఘటన జరిగేదికాదని పలువురు విమర్శిస్తున్నారు.

కళాశాల అభివృద్ధికి చేయూత



హుందాయ్ ప్రతినిధులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పెనుకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కియా అనుబంధ సంస్థ హుందాయ్ ప్రాసెస్ చేయూతనందించారు. మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో హుందాయ్ కంపెనీ ప్రతినిధులు యోన్‌సాంగ్, డూమ్‌ఇంకిం జూనియర్ కళాశాలకు రూ.25లక్షలు విలువచేసే కంప్యూటర్ సెంటర్‌ను స్టడీ అవర్స్‌కు పిల్లలకు అవసరమైన సభాప్రాంగణాన్ని ఏర్పాటుచేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.10లక్షలు వెచ్చించి కొత్త ప్రహారీగోడ, లైబ్రెరీ పిల్లలకు తాగడానికి మంచినీరు, బీరువాలు, పాఠశాలకు నాలుగు గదులకు గ్రిల్ ఏర్పాటుచేశారు. పిల్లలకు అవసరమైన ప్లేట్లు, గ్లాసులు, తినుబండారాలు, కిట్‌గా తయారుచేసి పంపిణీచేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజసేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా విద్యకు చేయూతనివ్వడం చాలా అదృష్టమన్నారు. వీటిన మాచేతులమీదుగా ప్రారంభించడానికి అవకాశం ఇచ్చినందుకు ప్రిన్సిపాల్ సుదర్శనకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సమాజసేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉందన్నారు. అనంతరం ప్రతినిధులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు డీవైఈఓ పద్మప్రియ శాలువాకప్పి సన్మానించారు.

రేపు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి హాజరు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో జరగనున్న అభివృద్ధి కార్యక్రమాలకు బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత హాజరుకానున్నట్లు మండల కన్వీనర్లు సిద్దయ్య, శ్రీరాములుయాదవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30కు పట్టణంలోని వివేకానంద కళాశాలలో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తారని, మధ్యాహ్నం 3గంటలకు మోటువారిపల్లిలో రోడ్డుకు భూమిపూజ, సాయంత్రం 4గంటలకు కురుబవాండ్లపల్లిలో కృష్ణాజలాలకు జలహారతి, సాయంత్రం 6గంటలకు పట్టణంలోని మడకశిర రోడ్డులో టీడీపీ నాయకులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెగ్యులర్ కమిషనర్‌గా సతీష్‌కుమార్

పెనుకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్(ఎఫ్ఏసి)గా పనిచేస్తున్న సతీష్‌కుమార్‌ను రెగ్యులర్ కమిషనర్‌గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆర్ఓగా పనిచేస్తున్న సతీష్‌కుమార్‌ను ఇటీవల పెనుకొండ ఎఫ్ఏసి కమిషనర్‌గా నియమించారు. ఆయనను రెగ్యులర్ కమిషనర్‌గా నియమిస్తూ మునిసిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా



అధికారులతో నిండిన మండల సమావేశం

గోరంట్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కోరం లేక స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ నరేంద్రకుమార్ వాయిదా వేశారు. ఉదయం 10.30గంటలకు సమావేశం నిర్ణయించినా, 22మంది ఎంపీటీసీ, ఓ జెడ్పీటీసీ ఉండగా, కేవలం ఒక ఎంపీటీసీ సభ్యుడుమాత్రమే సమావేశానికి హాజరైయ్యారు. మధ్యాహ్నం 12గంటలవరకు సభ్యుల రాక కోసం వేచి చూసినా ఎవరూ రాకపోయేసరికి సమావేశాన్ని వాయిదా వేస్తూ బుధవారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించాల్సిన ఎంపీపీ ప్రమీల రాకపోవడంతో ఆమెను వివరణ కోరగా, యేడాదిన్నర కాలంగా సభ్యులకు గౌరవ వేతనం అందలేదన్నారు. 45 రోజులక్రితం 15వ వార్షిక సంఘం నిధులు మండలానికి రూ.80లక్షలు రాగా, వర్క్స్ అలాట్మెంట్ చేయకపోవడంతో నిరసన తెలపడంకోసమే తాను, సభ్యులు సమావేశానికి గైర్హాజరు అయినట్లు వివరించారు.

గర్భిణులకు అన్నదానం

సోమందేపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం గర్భిణిలకు ముస్లింలు అన్నదానం చేశారు. ఆరోగ్య కేంద్రం వెనుక ఉన్న షెడ్డులో పౌష్టికాహారాన్ని తయారు వడ్డించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చికిత్స నిమిత్తం వచ్చే గర్భిణిలు, బాలింతల కోసం తమవంతు సాయం చేయాలనే ఉద్దేశంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేస్త్రి చాంద్‌బాషా, చికెన్‌షాపు అబ్దుల్లా, మహబూబ్ బాషా, వెల్డింగ్‌షాపు షాషా, ఈద్గాకమిటీ ప్రతినిధి బాబా, త్యాగి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ముస్లింలు

ఖైదీల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి



ఖైదీల కోసం వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి

హిందూపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సబ్‌జైలులో ఉన్న ఖైదీల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి సూచించారు. మంగళవారం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో శిక్ష అనుభవిస్తున్నవారిని ఆరాతీశారు. ఏయే నేరాల్లో తప్పులు చేసి జైలుకు వచ్చారు..? ఎప్పటి నుంచి ఉన్నారు..? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్థోమతలేకపోతే కోర్టు దృష్టికి తీసుకురావాలన్నారు. జైలు నుంచి బయటికి వెళ్లాక సత్‌ప్రవర్తనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

గోరంట్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. వ్యవసాయం, కేవీపీఎస్, భవన నిర్మాణ కార్మిక సంఘల నాయకులు, పాలసముద్రానికి చెందిన మహిళలతో కలిసి ఎంపీడీఓకు సమస్యలు వివరించారు. పాలసముద్రం జాతీయ రహదారికూడలిలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని వాగ్వాదం చేశారు. చౌకధాన్యపు డిపోల్లో రేషన్‌బియ్యం పంపిణీ సక్రమంగా జరగలేదని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, నాగభూషణ, ఆంజనేయులు, శోభా, గంగమ్మ, హబీబు, బాబా, సురమ్మ పాల్గొన్నారు.

'అధ్యాపకుల సమస్యలపై పోరాటం చేస్తాం'

హిందూపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో పనిచేసే అధ్యాపకుల సమస్యల కోసం పోరాటం చేస్తామని నూతనంగా ఎంపికైన ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల యూనియన్ ఉపాధ్యక్షురాలు గీత అన్నారు. మంగళవారం హిందూపురంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ జూనియర్ లెక్చరర్ల సమస్యలు ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన వాటిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రభుత్వందృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కోసం ఆందోళన

గోరంట్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వెంకటరమణపల్లికి చెందిన 90 కుటుంబాలు రేషన్ కోసం గోరంట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు. గతంలో వెంకటరమణపల్లిలో జరిగిన ఘర్షణల కారణంగా పోలీసు కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో కొందరు స్థానికంగా రేషన్ తీసుకుంటుండగా మరికొందరు పొరుగు గ్రామమైన శెట్టి చిన్నంపల్లి డీలర్ వద్ద తీసుకుంటున్నాయి. అయితే ఆ డీలర్ ప్రస్తుతం రేషన్ ఇవ్వనని చెప్పడంతో వారు ఆందోళనకు దిగారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏ గ్రామంలో వారు ఆగ్రామంలో తీసుకోవాలని తహసీల్దార్ చెప్పగా డీలర్లను మార్చాలంటూ పట్టుబట్టారు. గ్రామస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి నచ్చజెప్పారు.

నేరరహిత సమాజమే లక్ష్యం: ఎస్పీ



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

మడకశిర టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నేర రహిత ప్రాంతాలే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని ఎస్పీ రత్న అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. మంగళవారం మడకశిర అప్‌గ్రేడ్ సర్కిల్ పోలీసు స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూంను ఎస్పీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఎంతో అవసరమన్నారు. పట్టణంలోని ముఖ్యప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చినట్లు పేర్కొన్నారు. ప్రజలకు మరింతరక్షణ కల్పించేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కర్నాటక సరిహద్దు ప్రాంతం కావడంతో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం సీసీ కెమెరాలను వితరణ చేసిన మడకశిర వ్యాపారస్తులను ఎస్పీ శాలువాలతో సన్మానించారు. పెనుగొండ డీఎస్పీ నరసింగప్ప, ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, సీఐలు రాజ్‌కుమార్, నాగేష్‌బాబు, ఎస్ఐలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

పరిగి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన వివరాల మేరకు జయమంగళి నది నుంచి హిందూపురానికి చెందిన రెండు ట్రాక్టర్లు, పెన్నానది నుంచి గణపతిపల్లి గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారన్నారు. వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆ వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

అలరించిన సంగీత కచేరి

సోమందేపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి గ్రామంలో జరుగుతున్న నజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏర్పాటుచేసిన కర్ణాటక సంగీత కచేరి భక్తులను ఆకట్టుకుంది. చిత్ర, శ్రీకాంత్ బృందం స్వామివారిపై కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి, గుడిపల్లి గ్రామస్థులు భక్తులు పాల్గొన్నారు.

పురవీధుల్లో ఊరేగిన సీతారాములు

పెనుకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అతిపురాతనమైన శ్రీరామమందిరంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఎడ్లబండ్లపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

గోరంట్ల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం సమీపంలోని జాతీయ రహదారిపై బెల్లాలచెరువు క్రాస్‌రోడ్డు వద్ద కారు ఢీకొని దుబ్లానాయక్ (50) మంగళవారం మృతిచెందారు. పెనుకొండ మండలంలోని గోనిపెంటతండాకు చెందిన దుబ్లానాయక్ భార్య పుట్టినిల్లు గోరంట్ల మండలంలోని మిషన్‌తండా సమీపంలోని జాతీయ రహదారిని దాటుతుండగా అనంతపురంనుంచి బెంగుళూరు వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందారు. సీఐ శేఖర్ చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాంసం వ్యర్థాలతో ఇక్కట్లు



కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న స్థానికులు, సీపీఎం నాయకులు

సోమందేపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీ సమీపంలో చికెన్, మటన్ మాంసాల వ్యర్థాలను వ్యాపారస్థులు పారబోస్తుండటంతో దుర్వాసనతోపాటు రోగాలు ప్రబలుతున్నాయని కాలనీవాసులు, సీపీఎం పార్టీ నాయకులు మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రామాంజినేయులుకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సాయినగర్‌లో 500కుటుంబాలు నివాసమున్నాయన్నారు. సమీపంలో డంపింగ్‌యార్డ్ ఉండటంతో చెత్తాచెదారంతోపాటు మాంసం వ్యర్థాలు పారబోస్తుండటంతో దుర్వాసన అధికమయిందన్నారు. దీంతోపాటు వీధికుక్కలు గుంపులుగా ఆ ప్రాంతంలో సంచరిస్తుండటం కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులపై కుక్కలు దాడిచేస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. వెంటనే డంపింగ్ యార్డ్‌ను వేరేచోటికి మార్చాలని కోరారు. కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ త్వరలో సమావేశం ఏర్పాటుచేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. మాంసం దుకాణాలకు నోటీసులు అందించి యార్డ్‌ను మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ అనుబంధ సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేశులు, రామక్రిష్టప్ప, మహబూ, బెస్త కిష్టప్ప, కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతులకు పట్టా పుస్తకాలు ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

పావగడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గోమాళ, బీడుభూములను సాగు చేస్తున్న పేద రైతులకు ప్రభుత్వం చొరవతీసుకుని పట్టా పుస్తకాలు అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. మంగళవారం రాస్తారోకో చేశారు. ఉదయం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ప్రధాన రోడ్డులో గంటన్నరపాటు రాస్తారోకో చేశారు. తాలూకాలోని నిడిగల్, నాగలమడక, వైఎన్ హొసకోట, కసబ మండల కేంద్రాల్లో ఎంతో మంది నిరుపేద రైతులు భూములు లేక బీడు భూములను బంజరు భూములను సాగుచేస్తున్నారన్నారు. అనేకమార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ వాటిని చట్టబద్ధం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు సాగుచేస్తున్న భూముల్లో గ్రామ పంచాయతీ అధికారులు, నాయకులు ఆ భూములను తమ పంచాయతీ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేస్తామని ముందుకు రావడం దారుణమైన విషయమన్నారు. అక్రమ సక్రమ చట్టం కింద రైతులకు చట్టబద్ధం చేసి న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు